TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867

# తెలంగాణ శాసనసభ

తెలుగు దినపత్రిక

Published from Hyderabad,Rangareddy,Nalgonda,Mahabubnagar, Khammam,

తెలంగాణ | సంపుటి : 02 | సంచిక : 107 | ఎడిటర్ : పోలగోని రాజేష్ | సోమవారం 23 సెప్టెంబర్ - 2024 | పేజీలు : 8 | వెల : 04/-

## ఇందిరమ్మ ఇండ్లకు నో జీఎస్టీ!

### పీఎంఏవై రూల్స్ లబ్ధిదారుడికే.. నో ట్యాక్స్




- గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ. 12,500 కోట్లు నిధులు డబుల్ బెడ్ రూం లకు
- అందులో 18 శాతం దాదాపు 2,200 కోట్ల నిధులు
- నేరుగా లబ్ధిదారుడి ఖాతాలోకి నిధులు

**శాసనసభ / హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కేసీఆర్ అత్యంతంత ప్రతిష్టాత్మకంగా మొదలు పెట్టి అమలు చేసిన పథకంలో నిధులు పెద్ద ఎత్తున జీఎస్టీకే వెళ్ళాయంటే నమ్మకతప్పదు. ఇందిరమ్మ ఇండ్లకు దీటుగా నిర్మించామని చెప్పుకునేందుకు కేసీఆర్ వేసిన ఎత్తగడనే దీనంతటికి కారణమని తెలుస్తుంది. గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ. 12,500 కోట్లు నిధులు డబుల్ బెడ్ రూం లకు వెచ్చించగా.. అందులో 18 శాతం దాదాపు 2,200 కోట్ల నిధులు జీఎస్టీకే వెల్లడం విస్మయానికి గురి చేస్తున్నది.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించ తలపెట్టిన ఇందిరమ్మ ఇండ్లకు గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ లేదని తెలిసింది. నేరుగా లబ్ధిదారుడి ఖాతాలోకి నిధులు వెళుతుండటంతో ప్రభుత్వానికి ఎటువంటి ట్యాక్సు కట్టాల్సిన అవసరం లేదని సమాచారం. దీంతో ప్రభుత్వంపై పెద్ద ఎత్తున భారం తగ్గనుంది. అయితే, గతంలో కేసీఆర్ సర్కారు నిర్మించిన డబుల్ బెడ్ రూంలకు వెచ్చించిన నిధుల్లో అధిక భాగం జీఎస్టీకే వెళ్ళగా.. తాజాగా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో ప్రభుత్వంపై ఎటువంటి భారం పడే అవకాశం లేదని అధికారులు భావిస్తున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం భారం తగ్గనుంది. రైతు రుణ మాఫీ అమలు, రానున్న రోజుల్లో రైతు భరోసా వంటి పథకాలతో ఆర్థికంగా కటకట ఉండటంతో పాటు.. తాజా ఈ విధానంతో సర్కారుకి కొంతమేర ఊరట లభించనుంది. ఈ ఇందిరమ్మ స్కీం కూడా హడ్కో లోను ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న విషయం తెలిసిందే.

## “మీరే భారత బ్రాండ్ అంబాసిడర్లు”..

### ప్రవాసులపై మోడీ ప్రశంసలు..



- ఈవెంట్‌కి 14 వేల మంది ఎన్ఆర్ఐలు, సెలబ్రిటీలు, ఇండో అమెరికన్
- ఈ రోజు భారతదేశం 5జీ మార్కెట్ అమెరికా కన్నా పెద్ద
- భారత్‌లో ఎన్నికలు ముగిశాయి, ఇప్పుడు ఇక్కడ ఎన్నికలు

**ఢిల్లీ / శాసనసభ :** భారతదేశానికి మీరే బ్రాండ్ అంబాసిడర్లు అంటూ అమెరికాలోని ప్రవాస భారతీయులపై ప్రధాని నరేంద్రమోడీ ప్రశంసలు కురిపించారు. అమెరికాలో పర్యటిస్తున్న మోడీ ఈ రోజు న్యూయార్క్‌లోని నసావు కొలీజియంలో భారతీయ సమాజాన్ని ఉద్దేశించి మాట్లాడారు.లాంగ్ ఐలాండ్‌లోని కొలీజయం వద్దకు ప్రధాని రాగానే ప్రవాసులు ఘనంగా స్వాగతం పలికారు. “మోడీ అండ్ యూఎస్ ప్రోగ్రెస్ టుగెదర్” ఈవెంట్‌కి 14 వేల మంది ఎన్ఆర్ఐలు, సెలబ్రిటీలు, ఇండో అమెరికన్ కమ్యూనిటీ తరలించి వచ్చింది.

## తప్పు చేసి ప్రధానికి లేఖ రాయడానికి

### నీకు బుద్ధి ఉండక్కర్లా!: జగన్ పై చంద్రబాబు ఫైర్

- తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్న తిరుమల లడ్డూ వ్యవహారం
- ప్రధానికి లేఖ రాసిన జగన్
- నీది అసలు మనిషి పుట్టుకేనా? అంటూ చంద్రబాబు ఆగ్రహం
- నువ్వు ఏంచేసినా నడుస్తుందనుకుంటున్నావా? అంటూ మండిపాటు

**అమరావతి / శాసనసభ :** తిరుపతి లడ్డూ వ్యవహారంలో వైసీపీ అధినేత జగన్ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాయడం తెలిసిందే. దీనిపై ఏపీ సీఎం చంద్రబాబు ఘాటుగా స్పందించారు. తప్పు చేసిందే కాకుండా, పైగా ప్రధానికి లేఖ రాయడం కూడానా! అంటూ మండిపడ్డారు. తప్పిదానికి పాల్పడి ప్రధానికి లేఖ రాయడానికి బుద్ధి ఉండక్కర్లా? నువ్వు ఏం చేసినా నడుస్తుందనుకుంటున్నావా? నీది అసలు మనిషి పుట్టుకేనా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు.



## కేసీఆర్ వద్దంటున్న

### ప్రతిపక్ష నేత హెూదా హరీశ్ రావుకు దక్కుతుందేమోనని కేటీఆర్ భయం: మంత్రి కోమటిరెడ్డి



- విపక్ష నేత హెూదా కోసం కేటీఆర్, హరీశ్ పోటీపడుతున్నారన్న కోమటిరెడ్డి
- కేటీఆర్ కుటుంబ గొడవలతో ఫ్రస్టేషన్ కు గురవుతున్నారని ఎద్దేవా
- కేటీఆర్ చిన్న పిల్లాడేం కాదని, ఆలోచించి మాట్లాడాలని హెచ్చరిక

## ప్రధాని నరేంద్ర మోదీకి జగన్ లేఖ

- తిరుమల లడ్డూ వ్యవహారంలో గత ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు
- వాస్తవాలు వెలికితీయాలంటూ ప్రధాని మోదీని కోరిన జగన్
- కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని వెల్లడి
- సున్నితమైన అంశాన్ని రాజకీయాల కోసం వాడుకుంటున్నారని విమర్శలు



**అమరావతి / శాసనసభ :** తిరుమల లడ్డూ వ్యవహారంలో తమపై తీవ్ర ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. శ్రీవారి లడ్డూ కల్తీ అంశంలో నిజానిజాలు వెలికితీయాలని తన లేఖలో కోరారు. చంద్రబాబు అసత్య ప్రచారాలు చేస్తున్నాడంటూ ఆరోపించారు. 100 రోజుల అసమర్థ పాలన నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే లడ్డూ వివాదాన్ని తెరపైకి తెచ్చారని జగన్ తన లేఖలో పేర్కొన్నారు. ఈ వివాదంతో కోట్లాది మంది శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని, తిరుమల సంప్రదాయాలపై అపోహాలు పెంచే విధంగా ప్రచారం చేస్తున్నారని వివరించారు. ఇది ఎంతో సున్నితమైన అంశం అని, దీన్ని రాజకీయాల కోసం వాడుకుంటున్నారని జగన్ తన లేఖలో విమర్శించారు. చంద్రబాబు తన రాజకీయ అవసరాల కోసం ముఖ్యమంత్రి పదవికి అప్రదిష్ఠ తెచ్చేలా వ్యవహరిస్తున్నారని, టీటీడీ ప్రతిష్ఠను దిగజార్చిన చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పాలని ప్రధాని మోదీని కోరారు.

## మంత్రి శ్రీధర్‌బాబు చిన్న

### లాజిక్ మిస్ అయ్యారు: హరీశ్‌రావు

**శాసనసభ / హైదరాబాద్:** మంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని భారాస నేత హరీశ్‌రావు విమర్శించారు. హైదరాబాద్‌లో సీఎల్పీ సమావేశం అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు చేసిన వ్యాఖ్యలపై హరీశ్‌రావు స్పందించారు.“కాంగ్రెస్ కండువా కప్పి దేవుడి కండువా అని బుకాయించారు. కడియం శ్రీహరి, అరెకపూడి గాంధీ సీఎల్పీ సమావేశానికి హాజరయ్యారు. సీఎల్పీ భేటీకి హాజరైతే మర్యాదపూర్వక కలయిక అంటున్నారు. సీఎల్పీ భేటీకి హాజరైతే అది మర్యాద కాదు..అమర్యాద అవుతుంది. మంత్రి శ్రీధర్‌బాబు చిన్న లాజిక్ మిస్ అయ్యారు. నియోజకవర్గంలో సీఎం కార్యక్రమం ఉంటే కలవవచ్చు. కానీ, సీఎల్పీ సమావేశానికి వస్తే కలవకూడదు కదా. ఒక పార్టీ ఎమ్మెల్యే మరో పార్టీ ఎల్పీ భేటీకి ఎలా హాజరవుతారు? శ్రీధర్‌బాబు వైఖరి పిల్లి కళ్లు మూసుకుని పాలు తాగినట్టుంది” అని హరీశ్‌రావు విమర్శించారు.



## చీకట్లో కూడా ఆగని

### హైడ్రా కూల్చివేతలు..



**శాసనసభ / హైదరాబాద్ :** అమీన్ పూర్‌లో చీకట్లో కూడా ఆగకుండా హైడ్రా కూల్చివేతలు కొనసాగుతున్నాయి. అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలో హైడ్రా కూల్చివేతలు కొనసాగుతున్నాయి. కృష్ణారెడిపేటలో లైట్ల వెలుతురులో అక్రమ నిర్మాణాలను బాహుబలి మిషన్ కూల్చివేస్తోంది.అక్రమ నిర్మాణాన్ని ఆనుకుని ప్రక్కనే మరొక అపార్ట్మెంట్ ఉంది. అయితే.. ఆ అపార్ట్మెంట్ కు ఇబ్బంది కలుగకుండా కూల్చే ప్రయత్నం చేస్తున్నారు హైడ్రా అధికారులు.. పూర్తి నిర్మాణాలు కూల్చే వరకు హైడ్రా యాక్టివిటీ కొనసాగనున్నట్లు అధికారులు చెబుతున్నారు. పటేల్ గుడా లో చివరి దశ కు హైడ్రా కూల్చివేతలు చేరుకున్నాయి.

వివరాలు »»2లో

## పిల్లాడి ప్రాణంతో

### రిస్క్ అవసరమా..? సజ్జనార్ ఫైర్..



**శాసనసభ / హైదరాబాద్ :** సోషల్ మీడియా ఇప్పుడు ప్రజల జీవితంలో భాగమైపోయింది. చిన్నాపెద్దా అనే తేడా లేకుండా అందరూ యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వంటి సోషల్ మీడియాలో ఎక్కువ సమయం గడుపుతున్నారు.చాలా మంది సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో వీడియోలను పంచుకోవడం ద్వారా పాపులర్ కావడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు పిచ్చి పిచ్చి చేష్టలు చేస్తున్నారు.తాజాగా ఓ మహిళ బావి గోడపై కూర్చోని చిన్న పిల్లాడితో ప్రమాదకరమైన వీడియో చిత్రీకరించింది. బావి గోడ అంచున కూర్చున్న ఓ మహిళ సుమారు రెండు మూడేళ్ల వయస్సు కలిగిన పిల్లవాడిని బావి లోపలివైపుకు ఉంచి బాలుడు చేతిని పట్టుకొని ఉంది. ఈ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేయడంతో నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలుడు బావిలో పడి ప్రాణాలు కోల్పోయే పరిస్థితే ఉందని, ఎక్కడ తాను పడిపోతానో అంటూ భయపడుతూ గట్టిగా ఆ మహిళ కాలును పట్టుని కూర్చోవడంపై సోషల్ మీడియాలో అందరూ మండిపడుతున్నారు. ఈ వీడియోను తెలంగాణ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తన ట్విట్టర్ ఖాతాలో షేర్ చేశారు. ఇదెక్కడి పిచ్చి. సోషల్ మీడియాలో పాపులారిటీ కోసం ఇలా పిల్లాడి ప్రాణాన్ని రిస్క్ లో పెట్టడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఏమాత్రం తేడా వచ్చిన ఆ చిన్నారి ప్రాణాలకు ప్రమాదమనే కనీస సోయి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాకు బానిసలు కాకండి.. ఫేమస్ కోసం ఇలాంటి వెర్రి చేష్టలు చేయకండి అంటూ సజ్జనార్ తెలిపారు.

## కార్యకర్తలు,నాయకులకు

## నిత్యం అందుబాటులో ఉంటా..

**శాసనసభ / హైదరాబాద్:** మాదాపూర్‌లోని ట్రైడెంట్ హెూటల్లో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షత్తన సీఎల్పీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. పీసీసీ అధ్యక్ష పదవిని ఒక బాధ్యతగా భావిస్తా అని, పార్టీని ముందుకు నడపడంలో సమిష్టి బాధ్యత అవసరమని నేను నమ్ముతున్నా అని ఆయన అన్నారు.



శాసనసభ
తెలుగు దినపత్రిక
సోమవారం 23 సెప్టెంబర్ - 2024

( మొదటి పేజీ తరువాయి )

## ఇందిరమ్మ ఇండ్లకు నో జీఎస్టీ!

'డబుల్' తో ట్రిబుల్ తలనొప్పి

గతంలోని కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ఆత్మగౌరవానికి ప్రతీకలుగా చెప్పుకున్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం ట్రిపుల్ తలనొప్పి అయింది. రాష్ట్ర పరిధిలో సుమారు 1 లక్షా 50 వేల ఇండ్లు కట్టాలని నిర్ణయించగా.. జీహెచ్ఎంసీ పరిధిలో మాత్రం 1 లక్ష ఇండ్లు కట్టాలని బీఆర్ఎస్ సర్కారు ప్రణాళికలు రచించింది. వాస్తవానికి 66,789 వేల ఇండ్లు పూర్తి చేసింది. ఇందులో 65 వేల ఇండ్లను లబ్ధిదారులకు అందజేసింది. 18 వేల ఇండ్ల వరకు దాదాపు పూర్తయ్యే దశలో ఉన్నాయి. 11 వేల ఇండ్లు మాత్రం పెండింగ్ వర్కుల్లో ఉన్నాయి. వీటిని తెలంగాణ సర్కారు, హడ్కో సంస్థ ఇచ్చిన రూ. 8 వేల కోట్ల అప్పు.... రూ. 4,500 వేల కోట్ల బడ్జెట్ కేటాయింపులతో నిర్మించింది. మొత్తం రూ. 12,500 కోట్ల దాకా ఇందులో ప్రభుత్వం ఖర్చు చేయగా.. దానికి 18 శాతం జీఎస్టీలంటూ కేంద్రానికి ట్యాక్సులు పోయిన విషయం తెలిసిందే. ప్రభుత్వమే ఇండ్లు ప్రజలకు కట్టిస్తామన్న ముందుకు వచ్చిన నేపథ్యంలో ఈ భారం పడిందని అధికారులు గుర్తు చేస్తున్నారు.

పీఎంఏవై రూల్స్ లబ్ధిదారుడికే.. నో ట్యాక్స్

ఇందిరమ్మ ఇండ్లలో కేంద్రం ఇచ్చే నిధులు కూడా లబ్ధిదారుడికే వచ్చే అవకాశం ఉన్నది. వాటికి ట్యాక్స్ అంటూ ఏమీ ఉండదు. ఎందుకంటే, పీఎంఏవై రూల్స్ ప్రకారం లబ్ధిదారుల జాబితా ఇంటి నిర్మాణం ప్రారంభం కంటే ముందే కేంద్రానికి ఇవ్వాల్సి ఉంటుంది. జీహెచఎంసీ, రాష్ట్రంలోని ఇతర పట్టణ ప్రాంతాల్లో జరిపిన డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణంలో ప్రభుత్వం, కేంద్రానికి లబ్ధిదారుల జాబితాను నెమ్మదిగానో... ఆలస్యంగానో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ అందజేస్తుంది. 2011లో వెల్లడైన సామాజిక, ఆర్థిక సర్వేలో ఉన్న పేర్లనే ఇవ్వాలని కేంద్ర గృహ నిర్మాణ శాఖ ఒత్తిడి చేస్తున్నది. దాంతో రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బందులున్నా.. కేంద్ర ప్రభుత్వ నిధులు రావాలంటే, ఈ నిబంధనలు పాటించ తప్పదని చెబుతున్నారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల విషయంలో బీఆర్ఎస్ సర్కారు అవగాహనాలోపం వల్లనే జరిగిందని ఆ శాఖ అధికారులే వెల్లడిస్తున్నారు. అటు కేంద్ర ప్రభుత్వం పైసలు తెచ్చుకోవడంలో విఫలం అయ్యాం.. ఇటు పేదలకు ఇండ్లు కట్టడం సఫలం కాకపోవడడం.. నిధులన్నీ ట్యాక్సుల పాలు అవడంకి ప్రధాన కారణంగా గత ప్రభుత్వమే అంటూ.. ప్రస్తుత ప్రభుత్వం బలంగా అభిప్రాయపడుతున్నది.

## తప్పు చేసి ప్రధానికి లేఖ రాయడానికి నీకు బుద్ధి ఉండక్కర్లా!: జగన్ పై చంద్రబాబు ఫైర్

అరిచి గీపెట్టి, హైరేంజిలో బుకాయిస్తే మీ పాపాలు కొట్టుకుని పోతాయా? అని ప్రశ్నించారు. శ్రీవారికి తీరని ద్రోహం చేసి చరిత్రహీనులయ్యారని... ఇప్పుడు న్యాయమా? ధర్మమా? అంటూ నీతి వచనాలు పలుకుతున్నారని చంద్రబాబు విమర్శించారు. గతంలో సోనియా గాంధీ, అబ్దుల్ కలాం వంటివారే తిరుమల వచ్చినప్పుడు, వెంకటేశ్వరస్వామిపై నమ్మకం ఉందని అఫిడవిట్ ఇచ్చారని, వాళ్లకంటే మీరు గొప్పవాళ్లా? అని నిలదీశారు. భూమన తన కుమార్తె పెళ్లిని క్రైస్తవ సంప్రదాయం ప్రకారం చేశారని చంద్రబాబు వెల్లడించారు. అలాంటి వ్యక్తికి టీటీడీ చైర్మన్ పదవి ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చరిత్రలో ఎప్పటికీ క్షమించరాని నేరం చేశారని అన్నారు. కాగా, తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై ఐజీ స్థాయి అధికారితో సిట్ వేస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయిస్తామని, సిట్ దర్యాప్తు చేసి రిపోర్టు ఇస్తుందని తెలిపారు. ప్రజల మనోభావాలతో ఆడుకునే హక్కు ఎవరికీ లేదని చంద్రబాబు స్పష్టం చేశారు. తిరుమల శ్రీవారి ప్రసాదం విషయంలో జరిగిన అపచారం తొలగిపోయేందుకు రేపు ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు శాంతిహోమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పంచద్రవ్య సంప్రోక్షణ కూడా చేపడతామని పేర్కొన్నారు.

## కేసీఆర్ వద్దంటున్న ప్రతిపక్ష నేత హోదా హరీశ్ రావుకు దక్కుతుందేమోనని కేటీఆర్ భయం: మంత్రి కోమటిరెడ్డి

అమృత్ టెండర్ల విషయంలో ఆధారాలు ఉంటే ఇవ్వాలని సవాల్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి బీఆర్ఎస్ అగ్రనేతలపై ధ్వజమెత్తారు. కేసీఆర్ వద్దంటున్న ప్రతిపక్ష నేత హోదా హరీశ్ రావుకు దక్కుతుందేమోనని కేటీఆర్ భయపడుతున్నాడని వ్యాఖ్యానించారు. ఆ పదవి కోసం కేటీఆర్ కూడా పోటీ పడుతున్నారని వివరించారు. కుటుంబ గొడవలతో కేటీఆర్ ఫ్రస్ట్రేషన్ కు లోనవుతున్నారని ఎద్దేవా చేశారు. అసలు, కేటీఆర్ దోపిడీ వల్లే బీఆర్ఎస్ ఓడిపోయిందని కోమటిరెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో అప్రదిష్ఠపాల్జేసిన సత్యం రామలింగరాజు కొడుకు కేటీఆర్ కు రైట్ హ్యాండ్ అని ఆరోపించారు. కేటీఆర్ చిన్న పిల్లాడేం కాదని, ఆలోచించి మాట్లాడాలని హెచ్చరించారు. అమృత్ టెండర్లకు సంబంధించి రూ.8,888 కోట్లు మంజూరు అయినట్టు కేటీఆర్ వద్ద ఆధారాలు ఉంటే చూపించాలని సవాల్ విసిరారు. ఎన్నికల కోడ్ ఉన్న సమయంలోనే, తన బినామీ అయిన సత్యం రామలింగరాజు కుమారుడికి చెందిన ఓ సంస్థకు కేటీఆర్ టెండర్లు ఇచ్చారని కోమటిరెడ్డి ఆరోపించారు.గత పదేళ్లలో కవిత ఏం చేసిందో బయటపెడతామని అన్నారు. ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు రాష్ట్రానికి వచ్చి అప్రూవర్ గా మారితే కేటీఆర్, హరీశ్ రావు కచ్చితంగా జైలుకు వెళతారని కోమటిరెడ్డి పేర్కొన్నారు. అందుకే, కేటీఆర్, హరీశ్ రావు అమెరికా వెళ్లి రాష్ట్రానికి రావొద్దని ప్రభాకర్ రావుకు చెప్పి వచ్చారని ఆరోపించారు.

## చీకట్లో కూడా ఆగని హైడ్రా కూల్చివేతలు..

పటేల్ నగర్ లో 16 నిర్మాణాలు నేలమట్టం చేశారు హైడ్రా అధికారులు.. సుమారు 12 గంటలుగా అమీన్ పూర్ పరిధిలో హైడ్రా కూల్చివేతలు కొనసాగుతున్నాయి.అయితే.. కిష్టారెడ్డిపేట లో ఒక ఎకరం ప్రభుత్వం స్థలం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పటేల్ గూడలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన నిర్మాణాల తొలగించినట్లు, సర్వే నెం. 12/2, 12/3 లోని 25 నిర్మాణాల కూల్చివేసిన్టలు ప్రకటనలో తెలిపారు. పటేల్ గూడలో 3 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం చేసుకున్నట్లు, మూడు ప్రాంతాల్లో దాదాపు 8 ఎకరాలు ప్రభుత్వ స్థలం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. రెవెన్యూ, నీటిపారుదల, టౌన్ ప్లానింగ్ తో కలిసి కూల్చివేతలు జరిగినట్లు, నీటి వనరుల సంరక్షణ కోసం సంయుక్తంగా కృషి చేస్తున్నామన్నారు. నివాసం కోసం నిర్మించుకున్న భవనాలను కూల్చివేయలేదని, వ్యాపారం కోసం నిర్మించిన వాటిని మాత్రమే తొలగించామని ప్రకటనలో తెలిపారు.

## తెలంగాణలో ప్రజారోగ్య స్థితిని అధ్యయనం చేయడానికి బీఆర్ఎస్ ప్యానెల్

**శాసనసభ / హైదరాబాద్:** రాష్ట్రంలో ప్రజారోగ్య పరిస్థితిని పరిశీలించేందుకు కొత్తగా ఏర్పాటైన త్రిసభ్య కమిటీతో తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు కీలక సమావేశం నిర్వహించారు.మాజీ ఉప ముఖ్యమంత్రి టి రాజయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కమిటీలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యే మెటుకు ఆనంద్ ఉన్నారు. తెలంగాణలో క్షీణిస్తున్న ఆరోగ్య వ్యవస్థను అధ్యయనం చేయడానికి , ప్రభుత్వానికి సహాయం చేయడానికి ఈ బృందం ఏర్పడింది , ఈ రోజు తన కార్యకలాపాలను ప్రారంభించింది. ప్రస్తుత పరిస్థితులు , సవాళ్లను అంచనా వేయడానికి రాష్ట్రవ్యాప్తంగా అనేక ఆసుపత్రులను సందర్శించడం కమిటీ ఆదేశం. వారు తమ పరిశోధనలను నిర్మాణాత్మక నివేదికగా సంకలనం చేస్తారు, తదుపరి చర్య కోసం రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించబడుతుంది.ప్రజారోగ్య సేవలను మెరుగు పరచడానికి తక్షణ , సమర్థవంతమైన చర్యల ఆవశ్యకతను హైలైట్ చేస్తూ, ఈ చొరవ యొక్క



ప్రాముఖ్యతను కేటీఆర్ నొక్కిచెప్పారు. ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ పౌరులందరి అవసరాలను తీరుస్తుందని నిర్ధారించడం BRS లక్ష్యం, ముఖ్యంగా దాని పనితీరు గురించి ఇటీవలి ఆందోళనల నేపథ్యంలో కమిటీ యొక్క పని తెలంగాణ ప్రజలకు మెరుగైన ఆరోగ్య ఫలితాలను అందించడానికి, ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలు , సేవలను మెరుగుపరచడంలో రాష్ట్ర ప్రభుత్వానికి సహాయపడటానికి విలువైన అంతర్దృష్టులు , సిఫార్సులను అందించాలని భావిస్తున్నారు.

## తప్పులు జరగలేదంటే రాజకీయ సన్యాసం చేస్తా.. పొంగులేటి కి కేటీఆర్ సవాల్..



**శాసనసభ / హైదరాబాద్:** చిత్తశుద్ధి ఉంటే.. హైకోర్ట్ సీజే దగ్గరకు మంత్రి పొంగులేటి నాతో రావాలి.. టెండర్లలో తప్పులేమీ జరగలేదంటే.. రాజకీయ సన్యాసం చేస్తానని మంత్రి పొంగులేటి కి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు.ముఖ్యమంత్రి పదవికి రేవంత్ రెడ్డి రాజీనామా చేయటానికి సిద్ధంగా ఉండాలని కీలక వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి పదవి ఊడబీకటానికి మంత్రి పొంగులేటి ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్, కర్ణాటక మాజీ సీఎం యడ్యూరప్ప ఉద్యోగాలు పోయినట్లే రేవంత్ ఉద్యోగం కోల్పోతున్నాడన్నారు. బావమరిదికి అక్రమంగా టెండర్లు కట్టబెట్టిన వ్యవహారం రేవంత్ మెడకు చుట్టుకుంటుందన్నారు. భార్య సోదరుడు బావమరిది కాకుండా ఏమవుతారు? అని ప్రశ్నించారు. ఫోర్త్ సిటీ కాదు.. ముచ్చర్ల ఫోర్ బ్రదర్స్ సిటీ అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. పదేళ్ళు ప్రభుత్వాన్ని నడిపిన మాకు ఎలక్కడ అవినీతి జరుగుతుందో తెలియదా? అని ప్రశ్నించారు. కొండగల్ లిఫ్ట్ కథ సహా.. సీఎం కుటుంబ అన్‌అవినీతిని తేలుస్తామన్నారు. బావమరిది వ్యవహారంలో ఇరికిపోయాడాని సీఎంకు కూడా తెలుసన్నారు.చట్టాలే కాదు.. చుట్టరికాలు కూడా ప్రభుత్వ పెద్దలకు తెలియనట్లుందని తెలిపారు. చిత్తశుద్ధి ఉంటే.. హైకోర్ట్ సీజే దగ్గరకు మంత్రి పొంగులేటి నాతో రావాలని, టెండర్లలో తప్పులేమీ జరగలేదంటే.. రాజకీయ సన్యాసం చేస్తానని అన్నారు. సీజే దగ్గరకు రావటం ఇష్టంలేకుంటే.. ఢిల్లీ సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ దగ్గరకైనా రావాలని తెలిపారు. సీఎం ఇప్పటికైనా తప్పు ఒప్పుకుని టెండర్లు రద్దు చేయాలన్నారు. ఫిరాయింపులపై సీఎం, మంత్రులు న్యాయవ్యవస్థను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీ కలసి సింగరేణిని ప్రైవేటీకరించాలని ప్రయత్నిస్తున్నాయన్నారు. సింగరేణి వ్యవహారంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడాలని తెలిపారు. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేలంపాటకు భట్టి నవ్వుతూ వెళ్ళి మద్దతు తెలిపారని ఆరోపించారు. సింగరేణి లాభాల్లో కార్మికుల వాటాను ప్రభుత్వం తగ్గించిందన్నారు. లాభాల్లో వాటాను 33శాతం కాకుండా.. 16.9శాతమే పంచుతున్నారన్నారు. లక్షా 90వేలు కాదు.. 3లక్షల 70వేలు బోనస్ గా ఇవ్వాలన్నారు. సింగరేణి కార్మికుల వాటా తగ్గింపుపై గుర్తింపు సంఘం ఏఐటీయూసీ స్పందించాలన్నారు. కూనంనేని సాంబశివరావు తన అభిప్రాయం చెప్పాలన్నారు. వాటా పెంచాలని కార్మికులు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కలసి ఒత్తిడి చేయాలన్నారు. సింగరేణి కార్మికులకు బీఆర్ఎస్ అండగా నిలబడుతుందని తెలిపారు.

## గుట్ట మీద భక్తుల బసకు ఏర్పాటు.. దాదాపు 200 వరకు గదులు..!

**శాసనసభ / హైదరాబాద్:** యాదగిరిగుట్టపై దాదాపు 200 వరకు గదులను భక్తుల బసకు ఏర్పాట్లు చేపట్టారు. లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి వచ్చే భక్తులు వసతి పరంగా తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో..కొత్తగా 200 గదులు నిర్మించాలనే ప్రతిపాదన ముందుకు వచ్చింది. రాత్రి వేళల్లో కొండపై బస చేసి స్వామివారిని దర్శించుకునే భక్తులకు వసతి గదులు నిర్మించాలనే ప్రతిపాదనను ధార్మిక వ్యవహారాల శాఖ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం అనుమతిస్తే దాతల సహకారంతో గదులు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. శివాలయం వెనుక ప్రాంతంలో బాలాలయం స్థానంలో దాదాపు 200 గదులు నిర్మించే అవకాశం ఉంది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాలిస్తే గుట్టపై భక్తులు బస చేసేందుకు శాశ్వత ఏర్పాట్లు చేస్తారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ప్రస్తుతం ఈ గుట్టపై గ్రీన్ హోటల్ గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అవి పరిమితం కావడంతో భక్తులు కొండ కిందనే ఉండాల్సి వస్తోంది. తెల్లవారు జామున



స్వామివారి ఆర్జిత సేవల్లో పాల్గొనాలంటే కొండ కింద నుంచి పైకి రావాల్సిందే. అయితే ఉదయం పూట బస్సులు సమయానికి రాకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటన్నింటికీ పరిష్కారంగా కొండపైన పెద్ద సంఖ్యలో గదులు ఏర్పాటు చేస్తే భక్తుల కష్టాలు తీరుతాయి. భక్తుల సౌకర్యాలతో పాటు ఆలయ అభివృద్ధి పనులపై ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ధార్మిక శాఖ మంత్రి కొండా సురేఖ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో అధికారులు సమస్యల పరిష్కారానికి ప్రయత్నాలు ప్రారంభించారు.

( మొదటి పేజీ తరువాయి )

## కార్యకర్తలు, నాయకులకు నిత్యం అందుబాటులో ఉంటా..

పార్టీకి, ప్రభుత్వానికి మధ్య సమన్వయకర్తగా ఉంటానని ఆయన తెలిపారు. కార్యకర్తలు కష్టపడి పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలను గెలిపించుకోవాలని ఆయన తెలిపారు. జిల్లా ఇంచార్జ్ మంత్రులపై ఎక్కువ బాధ్యత ఉందని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. స్థానిక సంస్థల్లో 90 శాతం స్థానాలను గెలవాలని ఆయన అన్నారు. ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అందిస్తోందని, కార్యకర్తలను సమాయత్తం చేసి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే నా లక్ష్యమన్నారు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.అంతేకాకుండా..'నేను, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో మమేకమై పనిచేశాం.. అధికారాన్ని కట్టబెట్టిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేద్దాం.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలను పార్టీ, ప్రజాప్రతినిధులు జనంలోకి తీసుకెళ్లాలి. కేసీఆర్ అబద్దాలతో పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పరిపాలించారు.. కేసీఆర్ పదేళ్లలో 7 లక్షల కోట్ల అప్పు చేసి పోయాడు..రాహుల్ గాంధీ ఈ దేశానికి ఆశాకిరణం. రాహుల్ ను ప్రధాని చేయడమే ధ్యేయంగా అంతా పనిచేయాలి.. ప్రధాని మోదీకి భవిష్యత్తు లేదు.. కులం,మతం పేరుతో యువతను తప్పుదారి పట్టిస్తున్నారు.. వారిని చైతన్యపరచాలి.. రాహుల్ గాంధీతో చేయి కలిపి ముందుకు సాగాలి. ఎస్సీ,ఎస్టీ, బీసీ లు, మైనార్టీలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ ఆశీస్సులు ఎప్పుడు రాష్ట్ర కాంగ్రెస్ కు ఉంటాయి. కార్యకర్తల కష్ట సుఖాలు తెలుసుకొని ముందుకు వెళ్తా. రెండోసారీ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది. అని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.

## సిద్దిపేటలోని జ్యువెలరీ షాపులో చోరీని ఛేదించిన పోలీసులు..



**శాసనసభ / సిద్దిపేట:** సిద్దిపేటలో ఈ నెల 18న నయిమ్ మియా జ్యువెలరీ షాపులో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. జల్సాల కోసం దొంగతనాలకు పాల్పడుతున్న షణ్ముఖ రెడ్డి అనే వ్యక్తిని పోలీసులు అదుపులో తీసుకున్నారు.ఇతను ఏపీలోని విశాఖపట్నం మద్దిలపాలెంకి చెందిన వాడిగా గుర్తించారు. బంగారం కొనడానికి వచ్చి షాపులో నుంచి 8 తులాల బంగారు చైన్ ట్రేని షణ్ముఖ రెడ్డి ఎత్తుకెళ్లాడు. దీంతో మాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన పోలీసులు సీసీ ఫోటేజ్ ఆధారంగా షణ్ముఖ రెడ్డిని పక్కాప్లాన్ తో పట్టుకున్నారు. హైదరాబాద్ లో ఫ్రెండ్ బైక్ అడిగి దానిపై సిద్దిపేట వచ్చి షణ్ముఖ దొంగతనం చేసినట్లు వివరించారు.దుద్దేడ టోల్ గేట్ వద్ద వ్వాహనాల చెకింగ్ ఉండటంతో బైక్ పై వేగంగా వెళ్తూ నిందితుడు కిందికి పడిపోయాడు. గాయాలతో బైక్ ని ప్రజ్ఞాపూర్ లో పార్క్ చేసి వేరే షర్ట్ మార్చుకుని బస్సులో నిందితుడు హైదరాబాద్ వెళ్ళిపోయాడు. ప్రజ్ఞాపూర్ లో బైక్ తీసుకుని హైదరాబాద్ లో బంగారం అమ్మితే దొరికిపోతానని కరీంనగర్ లో దొంగిలించిన బంగారం అమ్మడానికి బయలుదేరాడు. పొన్నాల రంగిలా దాబా వద్ద పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. అయితే నిందితున్ని పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి 8 తులాల బంగారం, దొంగతనానికి ఉపయోగించిన బైక్ స్వాధీనం చేసుకున్నారు.మీరు ఎన్నన్నా మోసాలు, కుంభకోణాలు, నేరాలు, అక్రమ కట్టడాలు చేసుకోండి. కానీ మాకు, మా లాయర్లకు వాటాలు ఇవ్వకుండా ఎలా ఉండ గలరు? కేసులు వేసుకుని మీరు రండి. నల్ల కోట్లు వేసుకుని కోర్టుకు మేము వస్తాం. సామరస్యం గా సమస్య పరిష్కారం చేసుకుందాం.లంచాలివ్వ కుండా ఏమి చేసినా చట్టరీత్య చెల్లుబాటు కానివ్వ కుండా కాళ్లకు అడ్డమైపడతాము అని ముక్త కంఠంతో జడ్జిలు పరోక్షంగా పత్రిక ప్రకటన, సూచనలు జారీ చేస్తూనే ఉంటారు.అర్థం చేసు కోవాలి కదా. వల్లకాడు దర్యాప్తులు ఎప్పటికి కొలిక్కి రావు. వాయిదాలతో కోర్టు విచారణ ఒక నాటకం.అంతా డబ్బులు తినడాలే తప్ప, తీర్పు శిక్షలుండవ్. స్టే/ బెయిలు ఇవ్వడంతో ముగింపు.

## రోడ్లను ముంచిన వరద.. లోతట్టు ప్రాంతాల ఇళ్లలోకి నీళ్లు..



**శాసనసభ / హైదరాబాద్:** హైదరాబాద్‌లో కుండపోత వర్షం కురిసింది. నిన్న(శనివారం) సాయంత్రం గంటకు పైగా వర్షం కురవడంతో ప్రధాన రహదారులు మోకాలి లోతులో నీళ్లు నిలిచి చెరువులను తలపించాయి.వర్షపు నీటితో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. దీంతో రహదారులపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు చాలా దయనీయ స్థితిలో ఉన్నారు. మురికివాడలు, కాలనీల్లోనే కాదు ఇళ్లలోకి వరద పోటెత్తింది. ఖైరతాబాద్‌లోని ఎంస్‌మక్తా, బేగంపేట బ్రాహ్మణివాడి, లంగర్‌హౌస్, యూసుఫాగూడ శ్రీకృష్ణానగర్ బి–బ్లాక్, లక్ష్మీనర్సింహనగర్ ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరడంతో వాసులు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.రాత్రి 9 గంటల వరకు లంగర్‌హౌస్‌లో 9.1 సెంటీమీటర్లు, ఖైరతాబాద్ స్టాటిస్టిక్ భవన్‌లో 8.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రోడ్లపై వరద నీరు భారీగా నిలిచిపోవడంతో జీహెచ్ఎంసీ బృందాలు రంగంలోకి దిగి వరద నీటిని తొలగించారు. వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ సమస్యతో ఎక్కువ మంది మెట్రోను ఆశ్రయించారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్, సికింద్రాబాద్‌లో భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. కొన్ని ఇళ్లలోకి నీరు చేరి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాత్రి పడుకునే సమయంలో వర్షం కురవడంతో పనుల నిమిత్తం బయటకు వెళ్లిన వారు పూర్తిగా తడిసి ముద్దయ్యారు.

( మొదటి పేజీ తరువాయి )

## "మీరే భారత బ్రాండ్ అంబాసిడర్లు".. ప్రవాసులపై మోడీ ప్రశంసలు..

"భారత్ మాతాకీ జై" అంటూ మోడీ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. నమస్తే యూఎస్ అంటూ విష్ చేశారు.తాను ఇక్కడికి సుదూర తీరాల నుంచి వచ్చానని, గతంలో నేను ఓ పార్టీ కార్యకర్తగా ఇక్కడికి వచ్చానని, ఏ పదవి లేనప్పుడు అమెరికాలోని 29 రాష్ట్రాలు తిరిగానని చెప్పారు. ఎన్ఆర్ఐలు భారత్ అమెరికా మధ్య అనుసంధానకర్తలుగా ఉన్నారని అన్నారు. మీరంతా మన దేశానికి ప్రతినిధులు, దూతలుగా ఉన్నారని అన్నారు. భిన్నత్వాన్ని అర్థం చేసుకుని జీవించడం మన మూలాల్లోనే ఉందని, భాషలు అనేకం భావం ఒక్కటే అని, మనం ఎక్కడికెళ్లిన ఒక కుటుంబంలా వ్యవహరిస్తామని అన్నారు.భారత్, అమెరికా అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలని, భారత్‌లో ఎన్నికలు ముగిశాయి, ఇప్పుడు ఇక్కడ ఎన్నికలు జరగబోతున్నాయని చెప్పారు. అమెరికా మొత్తం జనాభా కంటే భారత్‌లో రెట్టింపు ఓటర్లు ఉన్నారని, భారత ప్రజాస్వామ్యం యొక్క ఈ స్థాయిన చూసినప్పుడు మేము మరింతగా గర్వపడుతున్నామని చెప్పారు. ప్రపంచానికి ఏఐ అంటే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అని, నాకు మాత్రం ఏఐ అంటే అమెరికా–ఇండియా అని అన్నారు.ప్రపంచంలో తాను ఎక్కడి వెళ్లినా, ప్రతీ నాయకుడు ప్రవాస భారతీయులను కొనియాడుతారని, నిన్న ప్రెసిడెంట్ బైడెన్ తనను డెలావర్‌లోని అతని ఇంటికి తీసుకెళ్లారని, అతడి ఆప్యాయత నాకు హృదయానికి హత్తుకునే క్షణమని, ఆ గౌరవం 140 కోట్ల మంది భారతీయులకు దక్కుతుందని అన్నారు. ఈ రోజు భారతదేశం 5జీ మార్కెట్ అమెరికా కన్నా పెద్దదని, కేవలం రెండేళ్లలోనే ఇది సాధ్యమైందని,ప్రస్తుతం మేడ్ ఇన్ ఇండియా 6జీ కోసం పనిచేస్తున్నామని అన్నారు. మహిళా సాధికారత కోసం పనిచేస్తున్నామని, ప్రస్తుతం ఇండియా అవకాశాలకు నిలయమని చెప్పారు.

# గురుకులాల నిర్వహణకు కామన్ డైరెక్టరేట్




**శాసనసభ / హైదరాబాద్:** రాష్ట్రంలోని అన్ని గురుకుల సొసైటీల నిర్వహణ కోసం కామన్ డైరెక్టరేట్‌ను ఏర్పాటుచేయాలని తెలంగాణ గురుకుల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ (టీజీపీఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రౌతు అజయ్‌కుమార్ సూచించారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన టీజీపీఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో గురుకులాల్లో నెలకొన్న సమస్యలు, పరిష్కారాలపై చర్చించారు. గురుకుల సొసైటీలలో ఏకరూప పనివేళలు, పనివిధానం అమలుచేయాలని అజయ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెస్ చార్జీలను పెంచాలని కోరారు. అనంతరం మైనారిటీ విభాగం రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నిమ్మల జితేందర్, ప్రధాన కార్యదర్శిగా రంగు స్వప్న, వైస్ ప్రెసిడెంట్ వెంకటయ్య, జ్యోతి, వరింగ్ ప్రెసిడెంట్ బండ శ్రీనివాసులు, కోశాధికారి వస్కుల రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీధర్, కార్యదర్శిగా జహిరున్నీసా, సంయుక్త కార్యదర్శి రమేశ్, మహిళా విభాగం ప్రెసిడెంట్‌గా సుధారాణి, సెక్రటరీ మోనికా సోని, సలహాదారులుగా చందర్‌రెడ్డి, కల్పన, అధికార ప్రతినిధిగా బాలకృష్ణ ఎన్నికయ్యారు. టీజీపీఏ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ రాంబాబు, కోశాధికారి రాజేశం, వరింగ్ ప్రెసిడెంట్ పైళ్ల ప్రకాశ్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ జీ భిక్షపతి, నీరజ తిరుపతి పాల్గొన్నారు. అక్రమంగా పట్టా చేసుకుంటే కేసు నమోదు ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర వెల్లడి ములుగురూరల్, సెప్టెంబర్ 22: వివాహం అనంతరం కుమారులు తల్లిదండ్రులను పట్టించుకోకపోతే స్థిరాస్తులను జప్తు చేస్తామని ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారసత్వంగా ఆస్తిని అక్రమంగా పట్టా చేసుకొని వ్యవసాయం చేస్తున్న వారిపై 1977 చట్టాన్ని అమలు చేస్తూ కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. కొద్దిరోజుల క్రితం ములుగు మండలం జాకారం గ్రామానికి చెందిన మామిడిశెట్టి చిన్న మల్లయ్యకు ఇద్దరు కుమారులు ఉండగా, మల్లయ్యకు సంబంధించిన వ్యవసాయ భూ మిని కొడుకులు అక్రమంగా ప ట్టా చేసుకొని తల్లిందండ్రులను పట్టించుకోలేదు. దీంతో తండ్రి మల్లయ్య రెవెన్యూ అధికారులను సంప్రదించారు. భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నట్టు అధికారుల విచారణలో తేలడం తో 1977 చట్టం ప్రకారం భూమి తిరిగి మల్లయ్యకు చెందేలా నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. దీంతోపాటు 2007 సీనియర్ పౌరుల పోషణ చట్టం ప్రకారం తల్లిదండ్రుల పోషణభారం తీసుకోవాలని అతని కుమారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

# పెద్దాస్పత్రులపై 'శవ' రాజకీయాలు!



**శాసనసభ / హైదరాబాద్:** పెద్దాస్పత్రులపై ప్రజలు నమ్మకం కోల్పోయేలా చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులకు వెళితే ప్రాణాలు పోతాయన్న భయాన్ని పేదల్లో కల్పిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ధర్మాస్పత్రుల్లో సరైన చికిత్స అందక రోగులు మరణిస్తున్నారంటూ ఆరోపణలు చేయడం, గణాంకాలు విడుదల చేయడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గాంధీ ఆస్పత్రిలో మరణాలపై నాలుగు రోజుల క్రితం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్‌లో ఒక పోస్టు పెట్టారు. 'ఒకే నెలలో గాంధీ ఆస్పత్రిలో 48 మంది పసిగుడ్డులు, 14 మంది బాలింతలు ప్రాణాలు కోల్పోయారని, ఊహించుకుంటేనే ఒళ్లు జలదరిస్తోందని, రాష్ట్రంలో వ్యవస్థలు పనిచేస్తున్నాయా?' అంటూ ప్రశ్నించారు. అలాగే ఒక్క గాంధీలోనే ఇన్ని మరణాలుంటే.. రాష్ట్రంలో పరిస్థితి ఏంటని ఆలోచిస్తే భయంగా ఉందని ఆందోళన వెలిబుచ్చారు. కేటీఆర్ పోస్టుపై వైద్యమంత్రి దామోదర ఘాటుగా స్పందించారు. గాంధీ ఆస్పత్రిపై బురద జల్లి, అక్కడికి వచ్చే నిరుపేదల మనోస్థైర్యాన్ని దెబ్బతీయవద్దని హితవు పలికారు. కార్పొరేట్ ఆస్పత్రులకు లబ్ధి చేకూర్చాలన్నదే ఆయన ప్రయత్నమని ఆరోపించారు. వైద్యమంత్రి కౌంటర్‌పై మళ్లీ కేటీఆర్ స్పందించారు. మరణాలపై సమీక్ష చేయాలని, సంఖ్యను ఎందుకు దాస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. దానిపై మళ్లీ మంత్రి కౌంటరివ్వడంతో బీఆర్ఎస్ తిరిగి స్పందించింది. గాంధీలో మాతాశిశు మరణాలపై సర్కారు అమానవీయంగా స్పందిస్తోందని, ఈ అంశంపై పార్టీ తరఫున ఒక నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. వైద్య శాఖ మాజీ మంత్రి రాజయ్య, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌తో కమిటీ వేశారు. ఆదివారం కేటీఆర్ వారితో సమావేశమయ్యారు. సోమవారం ఆ కమిటీని గాంధీతో పాటు సర్కారీ దవాఖానాలకు వెళ్లాలని సూచించారు. గతంలో కొవిడ్ సమయంలో గాంధీలో రోజూ వందల సంఖ్యలో మరణాలు సంభవించగా.. నాడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కూడా మరణాలను దాచింది. అప్పుడు విపక్షంలో ఉన్న కాంగ్రెస్ కూడా గాంధీ మరణాలపై ప్రశ్నించింది. నాడు కాంగ్రెస్, నేడు బీఆర్ఎస్ పెద్దాస్పత్రులను తమ రాజకీయాల కోసం వాడుకుంటున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఒకే బెడ్‌పై ఇద్దరు ముగ్గుర్ని ఉంచి వైద్యం చేస్తున్న ఫొటోలు మీడియాలో వస్తే.. నాటి సీఎం కేసీఆర్ డాక్టర్లు బాగా వైద్యం చేయడం వల్లనే అంతమంది వస్తున్నారని సమర్థించుకున్నారు. నేడు మళ్లీ అటువంటి కథనాలు, ఫొటోలు వస్తే ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ సర్కారీ వైద్య వ్యవస్థలన్నీ విఫలం అయ్యాయన్న అభిప్రాయాల్ని పేద రోగుల్లో కల్పిస్తోంది. గాంధీ, ఉస్మానియాలాంటి ఆస్పత్రుల్లో మరణాలు పెద్దసంఖ్యలో ఉండడానికి కారణాలు లేకపోలేదు. కేటీఆర్ పేర్కొన్న 14 ప్రసూతి మరణాలన్నీ కూడా చివరి దశలో గాంధీకివచ్చినవేనని వారి రిపోర్టులను బట్టి తెలుస్తోంది. ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొంది, డబ్బులు పెట్టలేక అక్కడి నుంచి చివరి దశలో గాం౨ధీ, ఉస్మానియా ఆస్పత్రులకు వచ్చే కేసులు భారీ సంఖ్యలో ఉంటాయి. సర్కారీ ఆస్పత్రులకు వచ్చిన ఒకట్రెండు రోజుల్లోనే వారు మరణిస్తున్నారు.

# ప్రైవేటు సర్వే నంబర్లతో ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు



**శాసనసభ /హైదరాబాద్ :** జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, శివారు మునిసిపాలిటీ.. ఇలా ప్రాంతమేదైనా ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టేవారిది ఒకే విధానం. నిర్మాణాలకు అనుమతులు పొందడంలో, కొనుగోలుదారులను మోసం చేయడంలో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ప్రైవేట్ పట్టా భూముల సర్వే నంబర్లతో నిర్మాణాలకు అనుమతులు తీసుకుంటూ చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు, ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడుతున్నారు. ఆ అనుమతి పత్రాలను చూపించి.. అక్రమ నిర్మాణాలను అమ్మకానికి పెడుతున్నారు. రూ.లక్షలు, కోట్లు దోచుకొని బయటపడుతున్నారు. జేబులు నింపుకొని నిబంధనలకు విరుద్ధంగా అనుమతులిస్తున్న అధికారులూ దర్జాగా ఉంటున్నారు. జీవిత కాలపు కష్టార్జితం, బ్యాంకు రుణాలు, బంగారం తనఖా పెట్టి అప్పు తీసుకున్న కొనుగోలుదారులు మాత్రం రోడ్డున పడుతున్నారు. అమీన్‌పూర్ మునిసిపాలిటీలోని పటేల్‌గూడలో అదే జరిగింది. గతంలో నిజాంపేట ఎర్రకుంట చెరువులోనూ ఇతర సర్వే నంబర్లతో అనుమతులు తీసుకొని ఇలాగే భవనాలు నిర్మించారు. హైడ్రా పరిశీలనలో ఆ నిర్మాణాలు చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నట్లు తేలడంతో నేలమట్టం చేశారు. అమీన్‌పూర్ మునిసిపాలిటీ పరిధిలోని పటేల్‌గూడలో సర్వే నంబర్ 164లో 27 ఇళ్లను నిర్మించారు. వాస్తవంగా అది ప్రభుత్వ భూమి. కానీ, ప్రైవేట్ పట్టా భూముల సర్వే నంబర్ల పేరిట అనుమతులు తీసుకొని.. సర్కారు స్థలంలో నిర్మాణాలు చేపట్టారు. బిల్డర్లకు మునిసిపల్, ఇతర విభాగాల అధికారులు సహకరించారన్న ఆరోపణలున్నాయి. నిబంధనల ప్రకారం.. మునిసిపాలిటీలోని ప్రణాళికా విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, రెవెన్యూ విభాగం ఇచ్చిన యాక్సెస్ ఆధారంగా స్థలం ఎక్కడుందో ఆన్‌లైన్‌లో కూడా చూడాల్సి ఉంటుంది. పక్కన ప్రభుత్వ భూములున్నాయా? లేదా? అన్నదీ తెలుసుకోవాలి. కొన్ని పరిస్థితుల్లో రెవెన్యూ విభాగం నుంచి నిరభ్యంతర పత్రమూ సమర్పించేలా నిర్మాణదారులకు సూచించాలి. ఇక్కడ మాత్రం మునిసిపల్ అధికారులు గుడ్డిగా అనుమతులిచ్చారనే ఆరోపణలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ నేతలు అధికార అండతో అనుమతులు పొందినట్లు విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో అనుమతులు ఇచ్చిన తీరు, దరఖాస్తుతోపాటు నిర్మాణదారులు సమర్పించిన పత్రాలు, ఇతరత్రా వివరాలనూ హైడ్రా అధికారులు పరిశీలించనున్నారు. దాని ఆధారంగా అధికారుల పొరపాటు ఉందని తేలితే.. వారిపై క్రిమినల్ కేసుల నమోదుకు ఫిర్యాదు చేయనున్నారు.

# పప్పు, ఉప్మా అంటేనే విరక్తి!



**ఉట్నూర్, సెప్టెంబరు 22 శాసనసభ :** 'పేద గిరిజన కుటుంబంలో పుట్టాను.. నా చిన్నతనం నుంచి ఇంట్లో పప్పు ఎక్కువ వండే వారు.. ఆ తర్వాత హాస్టల్లోనూ పప్పే ఎక్కువ వడ్డించేవారు.. అజ్ఞాతంలో ఉన్నప్పుడు ప్రతి రోజూ ఉప్మా తినే వాళ్లం. దీంతో పప్పు భోజనం, ఉప్మా అంటేనే నాకు విరక్తి వచ్చింది' అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఐదేళ్లకు ముందు తానుకూడా రక్తహీనతతో బాధపడ్డానని, ప్రస్తుతం దాన్నుంచి బయట పడ్డానని తెలిపారు. 12 శాతం హిమోగ్లోబిన్ ఉండాల్సి ఉండగా.. తనలో ఎప్పుడూ 8 శాతమే ఉండేదని తెలిపారు. ఆశ్రమ పాఠశాలల్లోని బాలికలు చాలా మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించి.. ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా మంచి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని ప్రశంసించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 60 ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన పోషణ మిత్ర అమలు చేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏల పరిధిలో ఉన్న బాలికల ఆశ్రమ పాఠశాలల్లో విస్తరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో గిరిజన పోషణ మిత్రను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నతాధికారులు తమ ఆలోచనలతో బాలికల సంక్షేమం కోసం కృషి చేయడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాను మంత్రి సీతక్కతోపాటు జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ఆలం, ఎమ్మెల్యే బొజ్జుపటేల్, ఎమ్మెల్సీ దండేవిఠల్ అభినందించారు.

# భావి తరాల కోసం ఆ అడవిని కాపాడుకోవాలి

## ధర్నా చౌక్‌లో జేఏసీ నేతల నిరసన




**శాసనసభ / హైదరాబాద్:** రాజధానికి అతి దగ్గరలో వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండం అడవుల్లో 3 వేల ఎకరాల రక్షిత అటవీ ప్రాంతంలో నేవీ రాడార్ స్టేషన్ నిర్మాణాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఉప సంహరించు కోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. లేదంటే పర్యావరణవేత్తలు, సామాజికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి స్టేషన్ నిర్మాణ పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. భావి తరాలకు మంచి ఆరోగ్యం అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని కోరారు. సేవ్ దామగుండం జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద నిరసన చేపట్టారు. సినీ దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, మెతుకు ఆనంద్, సామాజికవేత్త చెరుకు సుధాకర్, సేవ్ దామగుండం జేఏసీ కో ఆర్డినేటర్ రామన్న మాదిగ, నిర్వాహకురాలు గీత హాజరయ్యారు. పరిగి, వికారాబాద్ రంగారెడ్డి జిల్లాల నుంచి ప్రకృతి ప్రేమికులు పెద్దఎత్తున తరలివచ్చారు. రాడార్ స్టేషన్ కోసం.. దామగుండం అడవిలోని 12 లక్షల చెట్లను తొలగించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు ఇచ్చాయని వక్తలు ఆరోపించారు. అనేక సంవత్సరాలుగా జంట నగరాలకు వన మూలికలు అందిస్తున్న అడవిలో.. నరికివేసిన వాటి స్థానంలో 12 లక్షల మొక్కలను నాటుతామని చెప్పడం దారుణమన్నారు. అడవుల నరికివేతకు అనుమతులిచ్చిన రాష్ట్రాల్లో తెలంగాణ దేశంలోనే తొలిస్థానంలో ఉందన్న సంగతిని గుర్తుచేశారు. ఉన్న చెట్లను తొలగించి ప్రజలకు ఎలాంటి ఆరోగ్యం అందిస్తారని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొక్కలను పెంచాలంటూ పథకాలు తెస్తూనే.. అడవిలోని 12 లక్షల చెట్లను ఎలా తొలగిస్తారని నిలదీశారు. ప్రభు త్వం మొండిగా ముందుకెళ్తే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని సేవ్ దామగుండం నేతలు హెచ్చరించారు. ధర్నాలో పీవోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, ఆదివాసీ సంఘం నేత రవీందర్, వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు. దామగుండంలో రాడార్ స్టేషన్ నిర్మాణంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. రాడార్ స్టేషన్ అవసరమేనని, అయితే.. దామగుండంలో కాకుండా మరో ప్రాంతానికి దాన్ని తరలించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కోరారు.

# హిందూత్వంపై వ్యంగ్యాస్త్రాలు మానుకో నటుడు ప్రకాశ్‌రాజ్‌కు వీహెచ్‌పీ హెచ్చరిక




**శాసనసభ / హైదరాబాద్:** వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం విషయంలో కవ్వింపు చర్యలకు దిగి పరువు తీసుకోవద్దని నటుడు ప్రకాశ్‌రాజ్‌ను విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) హెచ్చరించింది. ఈ మేరకు ఆదివారం వీహెచ్‌పీ తెలంగాణ ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి ఓ ప్రకటన విడుదల చేశారు. తిరుమల తిరుపతి లడ్డూ ప్రసాదం వివాదంలో హిందూ విశ్వాసాలపై నమ్మకం లేని వ్యక్తులు తలదూర్చడం ఏ మాత్రం క్షమార్హం కాదన్నారు. 'చిన్న విషయాన్ని పెద్దది చేసి, ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయవద్దు' అంటూ ప్రకాశ్ రాజ్ వ్యంగ్యంగా మాట్లాడటాన్ని బాలస్వామి తీవ్రంగా ఖండించారు. ఇది రాజకీయ విమర్శలకు సంబంధించిన అంశం కాదని స్పష్టం చేశారు. కాగా, దేశవ్యాప్తంగా సనాతన ధర్మ బోర్డును ఏర్పాటు చేసి, దాని ద్వారానే హిందూ దేవాలయాల నిర్వహణ కొనసాగాలని ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభిప్రాయానికి విశ్వహిందూ పరిషత్ సంపూర్ణ మద్దతు తెలుపుతోందని బాలస్వామి ప్రకటించారు.

# ఆటో కార్మికులను ఆదుకోవాలి: కూనంనేని





**కొత్తగూడెం, శాసనసభ :** ఆటో, క్యాబ్ కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. కొత్తగూడెం క్లబ్‌లో ఆటో వర్కర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర తృతీయ మహాసభల్లో ఆయన ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో, క్యాబ్ కార్మికులకు ప్రతినెల రూ.12వేలు అందించి ఆదుకోవాలన్నారు. రూ.10లక్షల వరకు బీమా సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

# పర్యాటక ప్రాంతాల అభివృద్ధి: మంత్రి జూపల్లి



**శాసనసభ / హైదరాబాద్:** తెలంగాణకు దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు కార్యాచరణను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ-హైదరాబాద్ బైక్‌రైడర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బేగంపేట ప్లాజాలో 'రైడ్‌టు నిర్వాణ-బుద్ధవనం' బైక్ ర్యాలీని మంత్రి జూపల్లి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగార్జునసాగర్‌లో బౌద్ధ వారసత్వాన్ని నేటి తరానికి పరిచయం చేయడానికి అన్ని హంగులతో బుద్ధవనం ప్రాజెక్టును ప్రభుత్వం నిర్మించిందని చెప్పారు. అనంతరం టూరిజం ప్లాజా నుంచి తార్నాక వరకు మంత్రి జూపల్లి బైక్ నడిపి బైకర్స్‌లో ఉత్సాహాన్ని నింపారు.

# ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌పై వెనక్కి వెళ్లలేం



**శాసనసభ / వరంగల్ :** రీజినల్ రింగు రోడ్డు అలైన్‌మెంట్ మార్పుపై నిర్ణయం జరిగిపోయిందని, వెనక్కి వెళ్లడం కష్టమని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆర్‌ఆర్‌ఆర్ భూ సేకరణను ముందుగా నిర్ణయించిన అలైన్‌మెంట్ ప్రకారమే చేపట్టాలంటూ సీపీఎం ప్రతినిధులు బీవీ రాఘవులు, ఎస్ వీరయ్య, సీతారాములు, జూలకంటి రంగారెడ్డి తనను సచివాలయంలో కలిసిన సందర్భంగా రేవంత్ తన నిర్ణయాన్ని వెల్లడించారు. అయితే బాధితులకు నష్టపరిహారం పెంచే ప్రయత్నం చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. సిరిసిల్లలో పవర్‌లూమ్‌ల కరెంటు ఛార్జీలను ప్రభుత్వం యూనిట్‌కు రూ.2 నుంచి రూ.8.30కు పెంచడంతో 30 వేల మంది పవర్‌లూమ్ కార్మికులు ఆందోళనలో ఉన్నారని సీఎంకు సీపీఎం ప్రతినిధి బృందం వివరించింది. గతంలో ఉన్న విధంగా యూనిట్‌కు రూ.2 చొప్పున వసూలు చేసి కార్మికులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ సమస్యను పరిష్కరిస్తానని, పవర్‌లూమ్ పరిశ్రమను నాలుగో కేటగిరీ కిందకు తీసుకొస్తామని సీఎం హామీ ఇచ్చారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను అందించాలని కూడా సీపీఎం ప్రతినిధులు ముఖ్యమంత్రిని కోరారు. కాగా, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలంటూ సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు.

శాసనసభ
తెలుగు దినపత్రిక
సోమవారం 23 సెప్టెంబర్ - 2024

# డ్యాన్స్‌పై ఉన్న ఇష్టమే గిన్నిస్ రికార్డును అందించింది



చిరంజీవికి అరుదైన గౌరవంగిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు తెలుగు అగ్ర కథానాయకుడు చిరంజీవి కీర్తి కిరీటంలో మరో కలికితురాయి చేరింది.ఆయన 46ఏళ్ల సినీ ప్రయాణంలో తనదైన అభినయం, డ్యాన్సులతో కోట్లాది మంది ప్రేక్షకుల్ని రంజింపజేసి ఎన్నో పురస్కారాలు, గౌరవాలు సొంతం చేసుకున్న ఆయన.. ఇప్పుడు మరో విశిష్ట గౌరవాన్ని అందుకున్నారు. మోస్ట్ ప్రొలిఫిక్ ఫిల్మ్ స్టార్ ఇన్ ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీ యాక్టర్, డ్యాన్సర్‌గా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకున్నారు. 156 చిత్రాలు.. 537 పాటలు.. 24వేల స్టెప్పులతో అలరించినందుకు ఆయనకు ఈ రికార్డు దక్కింది. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గిన్నిస్ బుక్ ప్రతినిధి రిచర్డ్ స్టెన్నింగ్, బాలీవుడ్ నటుడు ఆమిర్ ఖాన్ చేతుల మీదుగా చిరుకు ఈ అవార్డును ప్రదానం చేశారు. అనంతరం ఆమిర్ ఖాన్ మాట్లాడుతూ.. "ఈ చారిత్రక ఘట్టాన్ని ప్రత్యక్షంగా చూడటం నాకు గర్వ కారణం. చిరంజీవి కోట్లాది మంది అభిమానుల్లాగే నేనూ ఆయన్ని అమితంగా ఆరాధిస్తాను. ఈ వేడుకకు నన్ను రావాలని కోరినప్పుడు.. 'ఇలా విజ్ఞప్తి చేయడమెందుకు ఆర్డర్ వేయమ'ని చెప్పా. ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించేందుకు చిరంజీవి ఒక్క స్టెప్పేస్తే చాలు. తన స్ఫూర్తి భారత దేశం దాటి చాలా దూరం చేరుకుంటుంది" అన్నారు. ఈ వేడుకలో ఆమిర్‌కు చిరు ఓ ఖరీదైన పెన్నును కానుకగా ఇచ్చారు.

### కంచాన్ని కొడుతూ స్టెప్పులేసేవాడిని

కథానాయకుడు చిరంజీవి మాట్లాడుతూ.. "గిన్నిస్ బుక్ రికార్డు నేను ఊహించనిది. దానికి కారకులైన నా దర్శక నిర్మాతలు, అభిమానులకు ధన్యవాదాలు. డ్యాన్స్‌పై ఉన్న ఆసక్తే నాకు ఈ అవార్డు అందించిందనిపిస్తోంది. అప్పట్లో నాకు నటనపై కంటే డ్యాన్స్‌పైనే ఇష్టం ఎక్కువ ఉండేది. రేడియోలో పాటలు వింటూ.. డ్యాన్స్ చేస్తూ అందర్నీ అలరించేవాడిని. ఎన్‌సీసీలో చేరాక.. భోజనం పూర్తయ్యాక కంచాన్ని కొడుతూ స్టెప్పులేసేవాడిని. తొలి సినిమా రోజుల్లో సావిత్రి, నరసింహరాజు, రోజా రమణి లాంటి వారు నన్ను ప్రోత్సహించేవారు. ఓసారి డ్యాన్స్ చేస్తుండగా కాలు జారి కింద పడిపోయాను. వారంతా 'అయ్యో' అంటుంటే నేను సమయస్ఫూర్తితో దాన్ని నాగిని డ్యాన్స్‌గా మార్చేశా. అది చూసిన ఓ సహాయ దర్శకుడు 'ప్రాణం ఖరీదు' సమయంలో దర్శకుడు క్రాంతి కుమార్‌కు నా గురించి చెప్పారు. ఆ చిత్రంలో నా కోసం ప్రత్యేకంగా ఓ డ్యూయెట్ పెట్టారు. 'పునాది రాళ్లు'లోనూ డ్యాన్స్ విషయంలో నేను ప్రధాన ఆకర్షణగా నిలిచా. నా డ్యాన్స్ కోసం ప్రేక్షకులు థియేటర్లకు వస్తున్నారంటూ.. అప్పటి దర్శక నిర్మాతలకు డిస్ట్రిబ్యూటర్ లింగమూర్తి నన్ను రికమెండ్ చేసేవారు. పాటల సంఖ్య విషయంలో నిర్మాత అశ్వినీదత్‌తో నాకెప్పుడూ గొడవే (నవ్వుతూ). నా చిత్రంలో ఆరు పాటలు ఉండాల్సిందే అనేవారు. అల్లు అరవింద్ కూడా అంతే. పాటల్ని బలవంతంగా పెట్టేవారు. కానీ, అవే నా విజయంలో కీలక పాత్ర పోషించాయి. బాల్యంలోని అలవాటు.. ఈ గౌరవాన్ని తీసుకొచ్చినందుకు సంతోషంగా ఉంది" అన్నారు. ఈ కార్యక్రమంలో సినీ ప్రముఖులు అశ్వినీదత్, అల్లు అరవింద్, కె.ఎస్.రామారావు, తమ్మారెడ్డి భరద్వాజ, కె.రాఘవేంద్రరావు, డి.సురేశ్‌బాబు, గుణశేఖర్, బి.గోపాల్, సాయి దుర్గా తేజ్, వరుణ్ తేజ్, సుస్మిత, వైష్ణవ్ తేజ్, శ్యామ్ ప్రసాద్ రెడ్డి, జెమినీ కిరణ్, రవిశంకర్, బాబీ, వశిష్ఠ తదితరులు పాల్గొన్నారు. చిరంజీవికి ఈ గౌరవం దక్కడం పట్ల దర్శకుడు రాజమౌళి, గోపీచంద్ మలినేని తదితరులు సామాజిక మాధ్యమాల ద్వారా శుభాకాంక్షలు తెలిపారు.


# ఆర్పీఎఫ్ అధికారిగా రవితేజ?



రవితేజ కథానాయకుడిగా భాను భోగవరపు దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. శ్రీలీల కథానాయిక.ఇటీవల ఈ చిత్ర సెట్స్‌లో రవితేజ ప్రమాదవశాత్తూ గాయపడటంతో చిత్రీకరణ తాత్కాలికంగా ఆగిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన కోలుకుంటుండటంతో ఈ సినిమాని పునఃప్రారంభించేందుకు సిద్ధమవుతోంది చిత్ర బృందం. వచ్చే నెల మధ్య నుంచి ఈ కొత్త షెడ్యూల్ మొదలయ్యే అవకాశముంది. రవితేజ ఈ సినిమాలో రైల్వే పోలీస్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) అధికారిగా కనిపించనున్నట్లు సమాచారం.ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇప్పటికే 40శాతం చిత్రీకరణ పూర్తి చేసుకున్నట్లు తెలిసింది. ఇది వచ్చే ఏడాది ప్రథమార్ధంలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతమందిస్తున్నారు. కార్తీక్ ఘట్టమనేని ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

# భన్సాలీ దర్శకత్వంలో నటించాలనేది నా కోరిక

ఈ ఏడాది 'ముంజ్యా', 'వేదా' లాంటి భిన్నమైన కథలతో సినీప్రియుల్ని ఆకర్షించింది బాలీవుడ్ నాయిక శార్వరీ వాఘ్. ప్రస్తుతం అలియాతో కలిసి 'ఆల్ఫా' అనే స్పై యాక్షన్ సినిమాతో బిజీగా ఉందామె.తన తొలి సినిమా సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో రూపొందినా.. అనుకోని కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ ఆగిపోయిందని అంటోంది శార్వరీ. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. భన్సాలీ దర్శకత్వంలో నటించడం గురించి కొన్ని ఆసక్తికర సంగతుల్ని పంచుకుంది."నేను భన్సాలీ చిత్రంతోనే సినీ రంగంలో ప్రవేశించాలనుకున్నాను. దానికి సంబంధించిన వర్క్‌షాప్‌లను కూడా పూర్తి చేశాం. కానీ.. కొన్ని అనివార్య కారణాల వల్ల ఆ సినిమా చిత్రీకరణ ఆగిపోయింది.ఆ తర్వాత ఆయన తెరకెక్కించిన 'బాజీరావ్ మస్తానీ' చిత్రానికి సహాయ దర్శకురాలిగా పని చేసే అవకాశం దక్కింది. కానీ.. భన్సాలీ దర్శకత్వంలో నటించాలనేది నా ఏన్నో ఏళ్ల కోరిక. ఆ అవకాశం కోసమే ఎదురుచూస్తున్నాను" అని చెప్పుకొచ్చింది శార్వరీ.





# సముద్రం ఎక్కాలా.. సముద్రం ఏలాల!

థియేటర్లలో ఎన్టీఆర్ 'దేవర' సందడి మొదలవడానికి సమయం దగ్గర పడుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రచార పర్వంలో భాగంగా ఆదివారం రిలీజ్ ట్రైలర్‌ను బయటకొదిలారు.

'నిన్న రేత్రి ఓ పీడ కల వొచ్చుండాది జోగులా. సంద్రం మళ్లీ ఎరుపెక్కి నిజంగా ఎర్ర సముద్రం అయినట్టు. అదీ నా చేతుల మీదుగా అయినట్టు కనిపించుండాది" అంటూ ఎన్టీఆర్ చెప్పే డైలాగ్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ఇది తీరం చెంతనున్న ఓ కుటుంబంలోని కొన్ని పాత్రల చుట్టూ అల్లుకున్న యాక్షన్ డ్రామా. ఇందులో ఎన్టీఆర్ తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేశారు. ఈ తాజా ట్రైలర్‌లో ప్రధాన పాత్రల తాలూకా లోతును.. వాటి మధ్య సంఘర్షణను ఆకట్టుకునేలా చూపించారు. "భయం పోవాలంటే దేవుడి కథ ఇనాల. భయం అంటే ఏమిటో తెలియాలంటే దేవర కథ ఇనాల", "సముద్రం మీద ఒక దేవర ఉన్నాడు చాలు. కొండ మీద ఇంకో దేవరని తయారు చేస్తే అది మీకే మంచిది కాదు", "సముద్రం ఎక్కాలా.. సముద్రం ఏలాల", "దేవర అడిగినాడంటే చెప్పినాడని" అంటూ ట్రైలర్‌లో వినిపించిన డైలాగ్స్ సినిమాపై అంచనాలు పెంచేలా ఉన్నాయి. ఎన్టీఆర్, జాన్వీ కపూర్ జంటగా కొరటాల శివ తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా చిత్రాన్ని ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. సైఫ్ అలీ ఖాన్ ప్రతినాయకుడిగా నటించారు. అనిరుధ్ సంగీతమందించారు. ఈ సినిమా ఈనెల 27న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.

### 'దేవర' ప్రీరిలీజ్ వేడుక రద్దు

'దేవర' ముందస్తు విడుదల వేడుక ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని నోవాటెల్ హెచ్ఐసీసీలో జరగాల్సి ఉండగా భద్రతా కారణాలతో రద్దయ్యింది. ఈ వేడుకకు 3వేల మందికి అనుమతి ఇవ్వగా.. పరిమితికి మించి భారీగా అభిమానులు పోటెత్తడంతో వేదిక ప్రాంగణం వద్ద గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో సభా ప్రాంగణంలోని అద్దాలు, కుర్చీలు ధ్వంసమయ్యాయి. పోలీసులు రంగంలోకి దిగి అభిమానుల్ని చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం వేడుక నిర్వాహకులు కార్యక్రమాన్ని రద్దు చేశారు. 'దేవర' వేడుక రద్దవడం తననెంతో బాధించిందన్నారు హీరో ఎన్టీఆర్. ఈ సినిమా కోసం తమ చిత్ర బృందమంతా పడిన కష్టాన్ని అభిమానులతో పంచుకోవాలని ఆసక్తిగా ఎదురు చూశామని.. కానీ, భద్రతా కారణాల దృష్ట్యా ప్రీరిలీజ్ వేడుకను రద్దు చేయాల్సి వచ్చిందన్నారు. ఈ విషయంలో అభిమానుల కంటే తానే ఎక్కువ బాధపడుతున్నట్లు తెలిపారు. దీనిపై ఎవరినీ నిందించొద్దని కోరారు. తనపై అభిమానులు కురిపిస్తున్న ప్రేమకు ఆజన్మాంతం రుణపడి ఉంటానన్నారు. ఈనెల 27న 'దేవర'తో థియేటర్లలో ప్రేక్షకుల్ని కలుస్తానని.. కొరటాల శివ ఎంతో అద్భుతంగా దీన్ని తెరకెక్కించారని.. ఇది ప్రతి ఒక్కరూ కాలరెగరేసుకునేలా ఉంటుందని.. కచ్చితంగా అదే జరుగుతుందని.. 'దేవర'పై అందరి ఆశీర్వాదం ఉండాలని కోరారు.

# డబ్ల్యూటీసీ ఫైనల్ చేరాలంటే టీమిండియా ఇంకెన్ని మ్యాచ్‌లు గెలవాలో తెలుసా? పూర్తి వివరాలు



భారత్-బంగ్లాదేశ్ మధ్య జరిగిన తొలి టెస్టు మ్యాచ్‌లో టీమిండియా 280 పరుగుల భారీ తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. ఈ విజయంతో ప్రతిష్ఠాత్మక ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో చివరి మ్యాచ్‌లో టీమిండియా తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకుంది.కాగా ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ మూడో ఎడిషన్‌లో ఫైనల్‌కి అర్హత సాధించాలంటే టీమ్ ఇండియా ఎన్ని మ్యాచ్‌లు గెలవాలి? ఏయే జట్లతో ఎన్నెన్ని మ్యాచులు ఉన్నాయో తెలుసుకుందాం రండి. 2023-25 ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో ప్రస్తుతం భారత జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. బంగ్లాదేశ్‌పై విజయం తర్వాత, టీమ్ ఇండియా 86 రేటింగ్ పాయింట్లు సాధించగా, జట్టు విజయాల శాతం 71.67గా ఉంది. WTC మూడో ఎడిషన్‌లో, టీమిండియా ఇప్పటివరకు వెస్టిండీస్‌ను 1-0తో మరియు ఇంగ్లాండ్‌ను 4-1 తేడాతో ఓడించింది. ఇప్పుడు 2 టెస్టుల సిరీస్‌లో బంగ్లాదేశ్‌ను 1-0 తేడాతో ఓడించి ఆధిక్యంలో నిలిచింది. టీం ఇండియా ఇంకా బంగ్లాదేశ్‌తో 1, న్యూజిలాండ్‌తో 3, ఆస్ట్రేలియాతో 5 టెస్టులు ఆడాల్సి ఉంది. దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌ను టీమిండియా ఇప్పటి వరకు 1-1తో సమం చేసింది. భారత్ ఇప్పటి వరకు ఏ మ్యాచ్‌లోనూ ఓడిపోలేదు.ICC నివేదిక ప్రకారం, WTC ఫైనల్స్‌కు అర్హత సాధించాలంటే టీమ్ ఇండియా రాబోయే 9 మ్యాచ్‌లలో కనీసం 6 గెలవాలి. ఇందులో బంగ్లాదేశ్‌తో 1 టెస్టు మ్యాచ్‌ను, న్యూజిలాండ్‌తో 3 టెస్టు మ్యాచ్‌లను భారత్ తన సొంత మైదానంలో ఆడనుంది. ఆ తర్వాత ఆ జట్టు విదేశీ గడ్డపై అంటే ఆస్ట్రేలియాలో 5 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది. ఫైనల్ చేరాలంటే ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో భారత్ టాప్-2లో ఉండాలి. తద్వారా 5 మ్యాచ్‌లు గెలిచినా, 1 మ్యాచ్‌ను డ్రా చేసుకున్నా భారత్‌కు ఫైనల్‌కు టిక్కెట్ దక్కుతుంది.మిగతా జట్ల గురించి చెప్పాలంటే.. డబ్ల్యూటీసీ ఫైనల్స్‌కు గట్టి పోటీ ఇస్తున్న ఆస్ట్రేలియా పాయింట్ల జాబితాలో రెండో స్థానంలో ఉంది. ఫైనల్ చేరాలంటే ఆస్ట్రేలియా 4 మ్యాచ్‌లు గెలవాలి లేదా 3 మ్యాచ్‌లు గెలిచి 1 మ్యాచ్‌ను డ్రా చేసుకోవాలి. అలాగే ప్రస్తుతం పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో ఉన్న న్యూజిలాండ్ జట్టు మిగిలిన 8 మ్యాచ్‌ల్లో కనీసం 6 మ్యాచ్‌లు గెలవాలి లేదా 5 మ్యాచ్‌లు గెలిచి 1 మ్యాచ్‌ని డ్రా చేసుకోవాలి.

# బంగ్లాదేశ్‌కు ఫీల్డింగ్ సెట్ చేయడంపై స్పందించిన రిషబ్ పంత్.. ఏం చెప్పాడంటే!

బంగ్లాదేశ్‌పై టీమిండియా భారీ విజయం సాధించింది. తొలి టెస్టులో బ్యాటింగ్, బౌలింగ్‌లో దుమ్మురేపి బంగ్లాను చిత్తుచేసింది. చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదికగా జరిగిన తొలి టెస్టులో భారత్ విజయం సాధించి రెండు టెస్టుల సిరీస్‌లో 1-0తో ముందడుగు వేసింది.మ్యాచ్ నాలుగో రోజైన నేడు (సెప్టెంబర్ 22) 280 పరుగుల తేడాతో రోహిత్ శర్మ సారథ్యంలోని టీమిండియా గెలిచింది. 21 నెలల తర్వాత టెస్టు ఆడిన భారత స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ శతకంతో చెలరేగాడు. అలాగే, తన మార్క్ కామెంట్లు, చర్యలతో ఫన్ కూడా పంచాడు. బ్యాటింగ్ చేస్తున్న పంత్ ఓ దశలో బంగ్లాదేశ్ ఫీల్డింగ్ సెట్ చేసేశాడు.ఈ తొలి టెస్టు మూడో రోజు బ్యాటింగ్ చేస్తున్న సందర్భంలో రిషబ్ పంత్ చేసిన ఓ పని అవాక్కయ్యేలా చేసింది. బంగ్లాదేశ్‌కు ఫీల్డింగ్ సూచనలు చేశాడు. మిడ్ వికెట్‌లో ఫీల్డర్‌ను పెట్టాలని బంగ్లా కెప్టెన్ నజ్ముల్ హుసేన్ శాంతోకు చెప్పాడు. అతడు అది ఫాలో అయ్యాడు. నేడు భారత్ మ్యాచ్ గెలిచాక ఈ విషయంపై పంత్‌ను కామెంటేటర్ సబా కరీమ్ ప్రశ్నించాడు.

బంగ్లా కెప్టెన్ నువ్వా.. శాంతోనా?

రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ కోసం ఫీల్డింగ్ ఎందుకు సెట్ చేశావని రిషబ్ పంత్‌ను సబా కరీం ప్రశ్నించాడు. "నేను ఓ ముఖ్యమైన ప్రశ్న అడగాలనుకుంటున్నా. రెండో ఇన్నింగ్స్‌లో టస్కిన్ అహ్మద్ బౌలింగ్ చేస్తున్నప్పుడు నువ్వెందుకు ఫీల్డింగ్ సెట్ చేశావ్. బంగ్లాదేశ్ కెప్టెన్ శాంతోనా.. నువ్వా?" అని పంత్‌ను సబా కరీమ్ ప్రశ్నించారు. దీనికి పంత్ తన మార్క్ ఫన్నీ ఆన్సర్ చెప్పాడు.అందుకే సెట్ చేశా..భారత మాజీ ప్లేయర్ అజయ్ జడేజా తనకు గతంలో ఓ మాట చెప్పారని పంత్ గుర్తు చేసుకున్నాడు. తనది అయినా.. ప్రత్యర్థి జట్టుదైనా మ్యాచ్‌లో ఆట క్వాలిటీ ఎప్పుడూ అత్యుత్తమంగా ఉండాలని అజయ్ తనతో చెప్పారని పంత్ తెలిపాడు.



ఇద్దరు ఫీల్డర్లు ఒకే చోట ఉండటంతో తాను బంగ్లాదేశ్‌కు సూచనలు ఇచ్చానని పంత్ అన్నాడు. "నేను మైదానం బయట అజయ్ జడేజాతో ఎక్కువగా మాట్లాడతా. క్రికెట్ క్వాలిటీ మెరుగ్గా ఉండాలని ఆయన చెబుతుంటారు. నువ్వు ఆడుతున్నా.. ప్రత్యర్థి జట్టుదైనా ఆట నాణ్యతతో ఉండాలని ఆయన అంటారు. మిడ్ వికెట్‌లో ఏ ఫీల్డర్ లేరని నేను గమనించా. అదే సమయంలో ఇద్దరు ఫీల్డర్లు ఒకే చోట ఉన్నారు. దీంతో ఓ ఫీల్డర్ మిడ్‌వికెట్‌కు వెళ్లాలని నేను సూచించా. అక్కడ ఫీల్డర్‌ను ఉంచాలని శాంతోకు చెప్పా" అని పంత్ తన మార్క్ సమాధానం ఇచ్చాడు.ధోనీతో పోలికపై..ఈ మ్యాచ్ ద్వారా టెస్టుల్లో తన ఆరో సెంచరీని రిషబ్ పంత్ పూర్తి చేసుకున్నాడు. దీంతో భారత్ తరఫున అత్యధిక టెస్టు సెంచరీలు చేసిన వికెట్ కీపర్‌గా మాజీ కెప్టెన్, దిగ్గజం ఎంఎస్ ధోనీ రికార్డును అతడు సమం చేశాడు. ఈ తరుణంలో ధోనీతో పంత్‌ను చాలా మంది పోలుస్తున్నారు. ఈ విషయంపై కూడా పంత్ స్పందించాడు. తనను ధోనీతో పోల్చవద్దని తాను ఇంతకు ముందు కూడా చెప్పానని పంత్ చెప్పాడు. తాను తనలాగే ఉంటానని అన్నాడు. ధోనీ చాలా క్రికెట్ ఆడారని రిషబ్ చెప్పాడు.